ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 18.0

ANDHRAJYOTHY
5

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
మంగళవారం 25 నవంబరు 2025

రైతులకు ఇబ్బంది కలుగొద్దు
- తూకం అయిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ 6
- భూనీడులో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

రిజర్వేషన్లు రెడీ

పంచాయతీ ఎన్నికలకు మిగిలింది నోటిఫికేషనే

- నేడో.. రేపో వెలువడనున్న షెడ్యూల్
- జిల్లాలో 423 సర్పంచ్ స్థానాలు
- ఎస్సీ, ఎస్టీ స్థానాలు పాతవే.. బీసీల స్థానంలో పెరిగిన జనరల్ సీట్లు
- రిజర్వేషన్ల ఖరారుతో వేడెక్కిన పల్లె రాజకీయం


పోల్కంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం



ఆశావహుల హల్‌చల్

సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో వాట్సాప్ గ్రూపుల్లో పోటీదారులు హల్‌చల్ చేస్తున్నారు. మద్దతుదారులు ఫలానా అభ్యర్థి పోటీ చేస్తున్నారంటూ పోస్టులు పెడుతున్నారు. సర్పంచ్ రిజర్వేషన్‌లలో అవకాశం కోల్పోయిన ఆశావహుల వద్దకు వెళ్లి, ఎంపీటీసీ ఎన్నికల్లో తన మద్దతు నీకేనని, ఇప్పుడు సర్పంచ్‌కు మద్దతివ్వాలని కోరుతున్నారు. గ్రామాల్లో రాజకీయం వేడెక్కడంతో వాతావరణం మారిపోయింది.

మహబూబ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ ఇచ్చిన నోటిఫికేషన్‌ను.. కోర్టు ఉత్తర్వులతో ప్రభుత్వం రద్దు చేసింది. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న కోర్టు నిర్ణయం మేరకు బీసీల రిజర్వేషన్లు తగ్గిస్తూ తాజాగా పంచాయతీలకు రిజర్వేషన్లను ఖరారు చేసింది. సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులకు రిజర్వేషన్లు ఫైనల్ చేస్తూ సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి గెజిట్ విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ స్థానాలలో పెద్దగా మార్పు లేకపోగా, గతంలో ఎస్సీ, ఎస్టీ జనరల్ ఉన్న చోట కొన్ని మహిళలకు రిజర్వు అయ్యాయి. బీసీలకు కేటాయించిన చోటనే చాలా స్థానాలు మారిపోయాయి. వాటి స్థానంలో జనరల్‌కు కేటాయించారు. రిజర్వేషన్లు ఫైనల్ కావడంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడమే మిగిలింది. నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం అనంతరం ఏ క్షణంలోనైనా ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. షెడ్యూల్ వెలువడితే డిసెంబరు 20-25 నాటికి ఎన్నికల ప్రక్రియ ముగియనుంది.

- జిల్లాలో 3,674 వార్డు స్థానాలు ఉన్నాయి. అందులో మహిళలకు 1,591, జనరల్‌కు 2,083 స్థానాలు కేటాయించారు. ఎస్టీలకు 803(21.85 శాతం) వార్డులు అలాట్ చేయగా, అందులో 564 స్థానాలు వంద శాతం ఎస్టీ జనాభావి ఉన్నాయి. ఎస్సీలకు 511(13.90 శాతం), బీసీలకు 1591(21.91 శాతం), జనరల్‌కు 2,083(42.32 శాతం) రిజర్వు అయ్యాయి.

రిజర్వేషన్లు ఇలా

మహబూబ్‌నగర్ జిల్లాలో 423 సర్పంచ్ స్థానాలున్నాయి. వీటిలో జనరల్‌కు 41.84 శాతం, బీసీలకు 20.33 శాతం, ఎస్సీలకు 14.18 శాతం, ఎస్టీలకు 23.64 శాతం రిజర్వేషన్లు దక్కాయి. ఎస్టీ జనాభా వంద శాతం ఉన్న పంచాయతీలలో మొత్తం ఎస్టీలకే రిజర్వ్ కావడంతో ఎస్టీ రిజర్వేషన్ శాతం పెరిగింది. జిల్లాలో వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న పంచాయతీలు 76 ఉన్నాయి. ఇక మిగిలిన పంచాయతీలలో ఎస్టీ జనాభా ఆధారంగా 24 పంచాయతీలు వారికి రిజర్వు అయ్యాయి. మొత్తంగా 100 పంచాయతీలు ఎస్టీలకు దక్కగా, అందులో 46 మహిళలకు, 54 జనరల్‌కు అలాట్ య్యాయి. ఇక బీసీలకు 86 స్థానాలు దక్కాయి. అందులో మహిళలకు 39, జనరల్ 47 స్థానాలు వచ్చాయి. ఎస్సీలకు 60 స్థానాలు కాగా, అందులో మహిళలకు 26 స్థానాలు, జనరల్‌కు 36 స్థానాలు దక్కాయి. జనరల్ కేటగిరిలో 177 పంచాయతీలు రిజర్వ్ కాగా, అందులో 84 మహిళలకు, 93 జనరల్ స్థానాలు ఉన్నాయి. జిల్లాలో 195 స్థానాలు మహిళలకు, 228 స్థానాలు జనరల్‌కు కేటాయించారు.


సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి తదితరులు


విద్యార్థినులకు అల్పాహారం వడ్డిస్తున్న సీఎం

మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- ఆడబిడ్డ సంతోషంగా ఉంటేనే ఆర్థికాభివృద్ధి
- విద్య, వైద్యం, ఉపాధి, సాగునీటిపై ప్రత్యేక దృష్టి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కొడంగల్‌లో రూ.103 కోట్ల పనులకు శంకుస్థాపన

కొడంగల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం కొడంగల్‌లో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహా, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తాపట్నాయక్ తదితరులతో కలిసి అక్షయ పాత్ర గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌షెడ్ నిర్మాణ పనులకు సీఎం భూమి పూజ చేశారు. అనంతరం రూ.103 కోట్లతో నియోజకవర్గంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కొడంగల్ పట్టణంలోని ఎన్కెపల్లి గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. చదువుతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఉన్నత స్థాయికి చేరుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి దోహ దపడుతుందని చెప్పారు. అన్ని రకాల ఉన్నత చదువులు ఒకేచోట అం దుబాటులో ఉండేలా కొడంగల్‌ను ఎడ్యుకేషన్ క్యాంపస్‌గా తీర్చి దిద్దుతామన్నారు. కొడంగల్ - నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంతో మరో మూడు సంవత్సరాల్లో కొడంగల్ ప్రాంతానికి కృష్ణా జలాలను తెచ్చి సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. 70 ఏళ్లుగా కొడంగల్ ప్రాంతం విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనకబాటుతనాన్ని ఎదుర్కొందన్నారు. అభివృద్ధిలో దేశంలోనే ఓ మోడల్‌గా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దనున్నట్లు సీఎం చెప్పారు. కొడంగల్ మండలంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, వికారాబాద్ - కృష్ణా రైల్వే లైన్ ఏర్పాటుతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధిలో ముందుకు సాగుతుందని చెప్పారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు నాణ్యమైన చీరలను అందిస్తున్నామన్నారు. ఒక్క విద్యార్థి కూడా ఆకలితో బాధపడకూదని అక్షయపాత్ర సహకారంతో నియోజకవర్గంలోని 312 పాఠశాలల్లో గల 28 వేల మంది విద్యార్థులకు రోజూ అల్పాహారం అందిస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన పథకం కూడా అమలు చేసేందుకు అక్షయపాత్ర గ్రీన్‌ఫీల్డ్ కిచెన్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశామని సీఎం తెలిపారు. కొడంగల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో హరే కృష్ణ మిషన్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న అల్పాహారం తయారీ కిచెన్ షెడ్‌ను సీఎం పరిశీలించారు. అల్పాహారం తయారు చేసే యంత్రాన్ని స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లు రాజేశ్‌రెడ్డి, వార్ల విజయకుమార్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


సభకు హాజరైన మహిళలు

సీఎం అపర భగీరథుడు: దామోదర

సేవకుడిగా ప్రజల మన్ననలు పొందుతున్న సీఎం రేవంత్‌రెడ్డి అపర భగీరథుడిగా ముందుకు సాగుతున్నారని మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహా అన్నారు. కొడంగల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని ప్రాంత ప్రజలు అదృష్టంగా భావించాలన్నారు.

అభివృద్ధి దిశగా కొడంగల్ : శ్రీహరి

సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కొడంగల్ ప్రాంతం అభివృద్ధి పథంలో సాగుతోందని రాష్ట్ర మంత్రి మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సీఎం సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ నాయకుల్లో జోష్ నెలకొంది.


ఆలయ ప్రాంగణంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, కురుమూర్తి స్వామి సేవకులు

కురుమూర్తికి రూ.84.13 లక్షల ఆదాయం

- గత ఏడాది కంటే 4.44 లక్షలు అధికం

చిన్నచింతకుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నచింతకుంట మండలం అమ్మాపురం సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారికి రూ.84,13,144 హుండీ ఆదాయం లభించింది. హుండీని మూడు సార్లు లెక్కించగా ఈ ఆదాయం వచ్చింది. ఈనెల 3న మొదటి సారి లెక్కింపులో 28,70,536 ఆదాయం రాగా, 11న రెండో సారి లెక్కింపు సందర్భంగా 24,83,628 ఆదాయం వచ్చింది. సోమవారం మూడో సారి హుండీని లెక్కించగా రూ.30,58,980 ఆదాయం సమకూరింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా గత ఏడాది రూ.79,68,810 ఆదాయం రాగా, సారి గతం కంటే 4,44,334 ఆదాయం అధికంగా వచ్చింది. హుండీ లెక్కింపులో మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు, ఆలయ సిబ్బంది, కురుమూర్తి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధికోసమే ఇందిరమ్మ చీరలు

- రెండేళ్లకు ఇందిరమ్మ గుర్తుకు వచ్చిందా?
- నారాయణపేట జిల్లా కేంద్రంలో ఆస్పత్రి ఉండాల్సిందే
- అభివృద్ధి కేంద్రం నిధులతోనే.. రాష్ట్రం దివాళా తీసింది
- విలేకరుల సమావేశంలో ఎంపీ డీకే అరుణ

నారాయణపేట న్యూ టౌన్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): వచ్చే గ్రామ పంచాయతి ఎన్నికల్లో లబ్ధిపొందాలని ఇందిరమ్మ చీరలు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీ డీకే అరుణ అన్నారు. సోమవారం నారాయణపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిన తరువాత ఇందిరమ్మ గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల పదవి కాలం ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించేదన్నారు. రాష్ట్రం దివాలా తీయడంతో కేంద్రం నుంచి రావాల్సిన రూ.3 వేల కోట్ల నిధుల కోసం ఎన్నికలకు ముందుకెళ్తోందన్నారు. హామీలన్నీ తుంగలోతొక్కి, ఎన్నికల్లో గెలువాలనే తపనతో పథకాల పేరుతో తాయిలాలు అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోనే ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు నాగురావు నామాజీ, కె.రతంగ్‌పాండురెడ్డి, బి.కొండయ్య, జిల్లా అధ్యక్షుడు కె.సత్యయాదవ్, ప్రధాన కార్యదర్శులు తిరుపతిరెడ్డి, లక్ష్మీశ్యాం సుందర్ గౌడ్, బలరాంరెడ్డి పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ


బాధితుల సమస్యలను వింటున్న కలెక్టర్ విజయేందిర బోయి

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. 112 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం ఎంతో దూరం నుంచి వస్తారని, సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలు శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, ఆర్డీవో నవీన్, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు బందోబస్తు ఏర్పాట్లు
- పరిశీలించిన డీఎస్పీ నల్లపు లింగయ్య 6
- హెలిప్యాడ్, పార్కింగ్, భద్రత, బారికేడింగ్‌పై అధికారులతో సమీక్ష

కేసులతో ప్రతిపక్షాల గొంతు నొక్కలేరు : చిట్టెం 6

సన్నాల బోనస్ జమ

- 5 గురు రైతులకు అందజేత..
- 78 మందివి ప్రాసెస్‌లో ఉన్నాయి
- జిల్లాలో 190 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటి వరకు 13,705 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- కలెక్టర్ విజయేందిర బోయి



పాలమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ వానాకాలానికి సంబంధించి రైతుల నుంచి కొనుగోలు చేసిన సన్నాలకు ప్రభుత్వం బోనస్ డబ్బులను వారి అకౌంట్లో జమ చేస్తోందని కలెక్టర్ విజయేందిర బోయి సోమవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 190 కొనుగోలు కేంద్రాలను ఈ నెల మొదటి వారంలోనే ప్రారంభించారు. ఇప్పటి వరకు 2,394 మంది రైతుల నుంచి 13,705 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, 320 మంది రైతులకు మద్దతు ధర డబ్బులు రూ.4.33 కోట్లు చెల్లింపులు చేశారని చెప్పారు. పోల్కంపల్లి కొనుగోలు కేంద్రానికి సంబంధించి 5 గురు రైతుల 304.800 మెట్రిక్ టన్నుల సన్నాలు కొనుగోలు చేయగా, వారికి మద్దతు ధర డబ్బులతో పాటు బోనస్ కలిపి మొత్తం రూ.1,52,400/- జమ చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా 78 మంది రైతుల బోనస్ రూ.21.67 లక్షలు ప్రాసెస్‌లో ఉన్నాయని, 4 రోజుల్లో ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. మద్దతు ధర డబ్బులు జమ అయిన వారంలోపు రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారులను నమ్మి ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని వివరించారు.

క్రీడలతో ఆరోగ్యకరమైన సమాజం

- నారాయణపేట ఎస్పీ డాక్టర్ వినీత్


బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ వినీత్

నారాయణపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని నారాయణపేట ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రెండ్లీ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్పీ సోమవారం స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో ప్రారంభించారు. బ్యాటింగ్ చేసి, ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు, క్రమశిక్షణ, టీమ్ వర్క్ సహనాన్ని పెంపొందిస్తాయన్నారు. టోర్నమెంట్‌లో 30 బృందాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివ శంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

110 ఫోన్ల రికవరీ

- సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి
- బాధితులకు అప్పగింత


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి


రికవరీ చేసిన సెల్‌ఫోన్లు

మహబూబ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన 110 సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటీ రిజిస్టర్) యాప్ ద్వారా రికవరీ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం కవాతుమైదానంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్పీ జానకి బాదితులకు సెల్ ఫోన్‌లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మొబైల్ ఫోన్ కోల్పోయిన వెంటనే ఐఎంఈఐ నెంబర్‌ను బ్లాక్ చేసి, ఆతరువాత ఫోన్‌ను ట్రేస్ చేసి రికవరీ చేస్తున్నామన్నారు. ఈ వ్యవస్థ దేశవ్యాప్తంగా మొబైల్ ట్రాకింగ్‌ను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చిందని వెల్లడించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్న కారణంగా ప్రతీ పౌరుడు డిజిటల్ సురక్షపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేయవద్దని, తెలియని నెంబర్ల నుంచి పంపే ఓటీపీలు, యూపీఐ పిన్, బ్యాంక్ వివరాలు షేర్ చేయొద్దన్నారు. మొబైల్స్ పోగొట్టుకున్న బాధితులు పోలీస్‌శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్పీ సీసీ రాంరెడ్డి, టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్, ఆర్ఐ కృష్ణయ్య, ఐటీ సెల్ ఎస్ఐ రవి పాల్గొన్నారు.

అలివి వలలను నిషేధించాలి

» కలెక్టరేట్ ముందు మత్స్యకారుల నిరసన



అలివి వలలతో పట్టిన చేపపిల్లలను చూపిస్తున్న మత్స్యకారుడు రాజు

గద్వాల న్యూటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అలివి వలలను నిషేధించాలని జోగుళాంబ గద్వాల జిల్లా, గుందిమల్ల గ్రామానికి చెందిన మత్స్యకారులు డిమాండ్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు సోమవారం వారు చిన్న చేపలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని తుంగభద్ర నదిలో కొందరు ఆంధ్రా ప్రాంతానికి చెందిన జాలరులు, స్థానిక మత్స్యకారులు, దళారుల సహకారంతో అలివి వలలతో చేపల వేట కొనసాగిస్తున్నారని తెలిపారు. దీంతో చిన్న చేపలు కూడా వలకు చిక్కి మత్స్యసంపద అంతరించి పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు ఈ ప్రాంతంలో నాటు సారాను కూడా విక్రయిస్తున్నారని తెలిపారు. అలివి వలలు ఉపయోగించిన వారిపై గతంలో అలంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు కూడా నమోదయ్యాయని తెలిపారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పార్ట్‌టైం ఉపాధ్యాయుడి సస్పెన్షన్



గురుకులం ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థి తల్లిదండ్రులు

కల్వకుర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బాలుడిపై గుంజిళ్లు తీయించిన ఉపాధ్యాయుడిని ప్రిన్సిపాల్ సస్పెండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణ పరిధిలోని జేపీనగర్ బాలుర గురుకులంలో ఓ విద్యార్థిని గుంజిళ్లు తీయించడంతో అస్వస్థతకు గురైన అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వార్త ప్రచురితమైంది. దీంతో పలు విద్యార్థి సంఘాల నాయకులు, బాలుడి తల్లిదండ్రులు పాఠశాల ముందు సోమవారం ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ స్పందిస్తూ పార్ట్‌టైం ఉపాధ్యాయుడు గోపాల్‌ను విధుల నుంచి తప్పిస్తున్నట్లు తెలిపారు.

21 మంది బైండోవర్



తహసీల్దార్ ముందు బైండోవర్ చేస్తున్న పోలీసులు

ఊట్కూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని మల్లేపల్లి, బిజ్వార్ గ్రామాలకు చెందిన పలువురిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మల్లెపల్లి గ్రామానికి చెందిన 14 మంది, బిజ్వార్ గ్రామానికి చెందిన 7గురిని తహసీల్దార్ చింతరవి సమక్షంలో బైండోవర్ చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండాలని, గొడవలు, ఘర్షణలు జరుగకుండా చూసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాజ నర్సయ్య, మాతుర్ నాయక్ పాల్గొన్నారు.

శక్తిపీఠంలో నేటి నుంచి గీతా జ్ఞానయజ్ఞం ప్రారంభం

నారాయణపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానం శక్తి పీఠంలో మంగళవారం నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు గీతా జయంతి సందర్భంగా గీతా జ్ఞాన యజ్ఞం భగవద్గీత సప్తాహ కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు శక్తి పీఠం ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈ గీతా జ్ఞాన యజ్ఞం ప్రతి రోజు రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వామి శాంతానంద సభా మండపం ఏసీ హాల్‌లో ఉంటుందని తెలిపారు. ఈ భగవద్గీత సప్తాహ కార్యక్రమానికి భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శక్తి పీఠం ట్రస్టు సభ్యులు దోమ సుధాకర్, నంది రాజశేఖర్, కర్నె గంగాధర్ రెడ్డి కోరారు.

కేసులతో ప్రతిపక్షాల గొంతు నొక్కలేరు

» మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మక్తల్‌రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేసులు నమోదు చేసి ప్రతిపక్షాల గొంతు నొక్కలేరని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి ఉద్దేశపూర్వకంగానే తనతో పాటు రైతులపై కేసులు నమోదు చేయించారని విమర్శించారు. నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తి కొనుగోలులో ఇబ్బందులపై రైతుల ఆందోళనకు మద్దతు తెలిపిన వారిపై కేసులు పెట్టడం సరికాదన్నారు. ఎనిమిది రోజుల తర్వాత పోలీసులు కేసు నమోదు చేయడం వెనుక ఎవరున్నారో ప్రజలకు అర్థం అవుతోందన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి ఒత్తిడి మేరకే పోలీసులు ఆలస్యంగా కేసు నమోదు చేశారని ఆరోపించారు. అభివృద్ధిపై చర్చించేందుకు ఎక్కడికి రమ్మన్నా వస్తానని మంత్రికి సవాల్ విసిరారు. రైతులు తమ హక్కు కోసం ఆందోళన చేస్తే కేసులు పెట్టించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు మంత్రి ఒత్తిడికి లోను కాకుండా, ప్రతిపక్ష నాయకులు, రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చెరువు కట్టపై జరుగుతున్న నిర్మాణాలకు అనుమతులు లేవని తేల్చి చెప్పారు. రైతులకు సంఘీభావం తెలిపితే కేసులు నమోదు చేస్తారా ఇదేం అరాచకమని ప్రశ్నించారు. విలేఖరుల సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చిన్న హనుమంతు, నాయకులు అన్వర్ హుస్సేన్, జుట్ల శంకర్, గార్లపల్లి నరసింహారెడ్డి, అమ్రేష్, వినోద్‌కుమార్, మన్నన్, నేతాజీరెడ్డి, ఈశ్వర్‌యాదవ్, కర్రెం ఆంజనేయులు పాల్గొన్నారు.

వెంకన్న స్వామికి వేల దండాలు

» మల్దకల్‌లో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

» వచ్చేనెల 9 వరకు కొనసాగనున్న జాతర

» 2న కల్యాణోత్సవం, 4న రథోత్సవం



దేవాలయంలో వెలసిన ప్రధాన దైవం వేంకటేశ్వరుడు

మల్దకల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండల కేంద్రంలో వెలసిన స్వయంభువు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వేళ య్యింది. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 9 వతేదీ వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వ హించనున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోనే కాకుండా ఉమ్మడి మహబూబ్‌న గర్ జిల్లాలో అతి పెద్ద రెండవ జాతరగా మల్దకల్ బ్రహ్మోత్సవాలు ప్రసిద్ధి చెందాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి, మొక్కుబడులు తీర్చుకుంటారు.

30న ధ్వజారోహణ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి పల్లకీ సేవలు మాత్రమే కొనసాగుతాయి. 30వ తేదీన ధ్వజారోహణతో ఉత్సవాలు అధికారికంగా ప్రారంభం అవుతాయి. అందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి కల్యాణోత్సవం వచ్చేనెల నెల 2వ తే దీ, మార్గశిర శుద్ధ ద్వాదశిన రాత్రి నిర్వహించనున్నారు. తెప్పోత్సవాన్ని 3వ తేదీ, త్రయోదశి బుధవారం నిర్వహించనున్నారు. ఆ తర్వాత 4వ తేదీ, పౌర్ణమి, గురువారం రాత్రి కీలక ఘట్టం రథోత్సవాన్ని నిర్వహించ నున్నారు. ఆయా కార్యక్రమాలకు మంత్రాలయ పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు, విద్యాసింధు పీఠాధిపతి మాధవ తీర్థ స్వామి, పలిమారు మఠం పీఠాధిపతి విద్యాధీశతీర్థులు, బెంగుళూరుకు చెందిన సువిదేంద్రతీర్థులు, హంపీ పీఠాధిపతి శ్రీవిద్యారణ్యభారతి స్వామి తదితరులు హాజరుకానున్నారు. దాదాపు 20 రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉత్సవాలకు దాదాపు 10 లక్షల మంది భక్తు లు హాజరుకావచ్చని ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి తెలిపారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

రాజభవనాన్ని కాపాడుకోవాలి

» తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత



ఏదుల రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కవిత

వనపర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి సంస్థానానికి ఓ చరిత్ర ఉన్నదని, శిథిలావస్థలో ఉన్న రాజ భవనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా కు ఆదివారం వచ్చిన ఆమె పలు కార్యక్రమా లు, సమావేశాల్లో పాల్గొన్నారు. రెండో రోజు సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజభవనం మరమ్మతుకు గత ప్రభుత్వ హయాంలో రూ.23 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుత ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసిందన్నారు. మళ్లీ ఈ ప్రభుత్వం రూ. 8 కోట్లు మంజూరు చేసినట్లు తెలిసిందని, వెంటనే పనులను ప్రారంభించాలని కోరారు. జా గృతి జనంబాట కార్యక్రమం పూర్తయ్యే లోపు ఈ భవనాన్ని పట్టించుకోకపోతే, మార్చిలో నేనే స్వయంగా వచ్చి మరమ్మతులు పూర్తి చేసి, రంగులు వేయిస్తానని తెలిపారు. అనంతరం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మేధావులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. ఆ తర్వాత ఏదుల రిజర్వాయర్‌ను పరిశీలించారు.

జనజాగరణ అభియాన్‌ను విజయవంతం చేయాలి

» భారతీయ కిసాన్ సంఘ్ జోనల్ కార్యదర్శి వెంకోబా

» పగిడిమారిలో ముఖ్య కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘం జోనల్ కార్యదర్శి వెంకోబా

ఊట్కూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న జనజాగరణ అభియాన్‌ను విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జోనల్ కార్యదర్శి వెంకోబా పిలుపు నిచ్చారు. నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని మండలంలోని పగిడిమారిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి గ్రామానికి చెందిన వారితో పాటు అమీన్‌పూర్, ఓబ్లాపూర్, వల్లంపల్లి, సామనూరు గ్రామాలకు చెందిన వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకోబా మాట్లాడుతూ జనజాగరణ అభియాన్‌ను విజయవంతం చేసి దేశభక్తిని చాటాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, పండుగలు, ఆలయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. హైందవధర్మం, సంస్కృతిని కాపాడుకుంటూ ఐకమత్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌రెడ్డి, అశోక్‌కుమార్, బీరప్ప, నరసింహారెడ్డి, జయంత్ రెడ్డి, హనుమంతు, వెంకటేశ్‌లతో పాటు వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు పాల్గొన్నారు.



కొత్త తెలంగాణ చరిత్ర సభ్యులు గుర్తించిన అరుదైన జైన శిల్పాలు

తూముకుంటలో అరుదైన జైన శిల్పాలు

» పరిశీలించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం



శిల్పాలను పరిశీలిస్తున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు బైరోజు చంద్రశేఖర్

వనపర్తి ,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పీపనగండ్ల మండలం తూముకుంట గ్రామంలో శతాబ్దాల నాటి చరిత్ర వెలుగులోకి వచ్చింది. గ్రామ శివారులోని శివాలయం ప్రాంగణంలో కొన్ని అరుదైన శిల్పాలను గ్రామస్థులు గుర్తించారు. ఈ విషయాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు బైరోజు చంద్రశేఖర్, బైరోజు శ్యాంసుందర్‌ల దృష్టికి తీసుకువెళ్లారు. వారు పరిశీలించి, వాటిని జైన శిల్పాలుగా గుర్తించారు. కాకతీయుల పాలనలో ఈ ప్రాంతంలో జైన ధర్మానికి ఉన్న ప్రాధాన్యాన్ని సూచించే విలువైన ఆధారాలని వారు తెలిపారు. వాటిపై ఉన్న శాసనాలను పూర్తిగా చదవలేనప్పటికీ, శిల్పాలలో జైన తీర్థంకరుల ప్రతిరూపాలు, వాటి రూపకల్పన కాకతీయ శిల్ప కళకు దగ్గరగా ఉన్నట్లు చెప్పారు. వీటి ఆధారంగా తూముకుంట పరిసర ప్రాంతాల్లో జైన విద్యా కేంద్రం ఉండేదని చెప్పవచ్చునని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ తెలిపారు. గుర్తించిన శిల్పాల్లో జైన తీర్థంకరుడు, వర్ధమాన మహావీరుడు, ధ్యాన సంసిద్ధుడై ఉండగా అతని తలపై మూడు వరుసలలో గొడుగు, ఇరువైపులా చామరాలు చెక్కి ఉన్నట్లు చెప్పారు. శిల్పం కింది అంతస్తులో జ్ఞాన పీఠానికి రెండు వైపులా ఇద్దరు శ్రామికులు కూర్చొని ఉన్నారని, ఇలాంటి విగ్రహాలను పుస్తక గచ్ఛ లేదా సరస్వతి గచ్ఛ అంటారని తెలిపారు. ప్రధానంగా ఒక శిల్పంలో వీరుడికి గండ పెండేరం ఉందని, తెలిపారు. అలాగే గ్రామానికి సమీపంలో సింగారం గుట్టపై పది అడుగుల పైన సుపర్శ్వనాథుడి విగ్రహం కూడా లభించినట్లు తెలిపారు. పురావస్తు శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి అరుదైన శిల్పాలను భద్రపరచాలని కోరారు.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ నల్లపు లింగయ్య

సీఎం పర్యటనకు బందోబస్తు ఏర్పాట్లు

» పరిశీలించిన డీఎస్పీ నల్లపు లింగయ్య

మక్తల్‌రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసెంబర్ 1న నారాయణపేట జిల్లాకు రానున్నారు. ఈ సందర్భంగా మక్తల్ మండలంలోని గొల్లపల్లి శివారులో సీఎం బహిరంగ సభ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రాంలాల్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి పరిశీలించారు. వేదిక వద్ద బందోబస్తు, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాలు, భద్రతాపరమైన అంశాలు, బారికేడింగ్ తదితర ఏర్పాట్లపై అధికా రులతో సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

రైతులకు ఇబ్బంది కలుగొద్దు

» ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్

» భూనీడులో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



భూనీడులో కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్

కొత్తపల్లి, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ సిబ్బందిని ఆదేశించారు. నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలంలోని భూనీడులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూకం అయిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో రైస్‌మిల్లు కు తరలించాలని సూచించారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందు న టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అవుసలికుంట విద్యార్థి

లింగాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండలంలోని అవుసలికుంట గ్రామానికి చెందిన వంగూరు సాయికుమార్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. కల్వకుర్తి పట్టణంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అస్మిత, ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో సాయికుమార్ పాల్గొన్నాడు. ఆరు కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం అతడిని గ్రామ కార్యదర్శి చంద్రయ్య, ప్రధానోపాధ్యాయుడు పాండు, మహిళా సంఘం అధ్యక్షురాలు ఆబేదాబేగం తదితరులు అభినందించారు.

వెయిట్ లిఫ్టింగ్ జట్ల ఎంపిక



ఉమ్మడి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17, 19 వెయిట్ లిఫ్టింగ్ ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లను సోమవారం ఎంపిక చేశారు. పాలమూరు జిల్లా ప్రధాన స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్‌లో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొనన్నుట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ అఫ్రోజ్, కోచ్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్తకు జీవితఖైదు

మహబూబ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని పథకం ప్రకారం చంపిన భర్తకు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని గొండ్యాల గ్రామానికి చెందిన మిర్యాల రాములుకు మంగమ్మ అనే మహిళతో వివాహేతర సంబంధం ఉంది. దానికి అతడి భార్య భీమమ్మ అడ్డుగా ఉందని రాములు భావించాడు. మంగమ్మ ప్రోద్బలంతో 2023, జనవరి 25న అర్ధరాత్రి భార్యపై సైకిల్ హ్యాండిల్‌తో తీవ్రంగా కొట్టి చంపేశాడు. అనంతరం ఆమె మద్యం తాగి, ఛాతీనొప్పితో చనిపోయిందని అందరినీ నమ్మించాడు. కానీ పోస్టుమార్టమ్ నివేదికలో రక్తపు గాయాలున్నాయని వెల్లడైంది. దీంతో పోలీసులు భర్త రాములును అదుపులోకి తీసుకుని విచారించారు. తానే హత్య చేసినట్లు అతడు అంగీక రించడంతో కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు, రూ. 2 వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి కల్యాణచక్రవర్తి సోమవారం తీర్పు వెల్లడించారు. కేసు దర్యాప్తులో క్రియాశీలకంగా పని చేసిన పోలీసులను ఎస్పీ జానకి అభినందించారు.

పోలీసు వాహనంపై కూర్చొని 'రీల్స్' చేసిన ఆకతాయి

» నారాయణపేట జిల్లా ఊట్కూర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సంఘటన

» సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో



పోలీస్ వాహనంపై కూర్చొని ఫోజులు ఇస్తున్న గుర్తు తెలియని యువకుడు

ఊట్కూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టపగలు పోలీస్‌స్టేషన్ ఆవరణలో, కదులుతున్న పోలీస్ వాహనం పైన కూర్చొని ఓ యువకుడు రీల్స్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నారాయణపేట జిల్లా, ఊట్కూర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ సంఘటన జరిగింది. పోలీస్ వాహనం ముందుకు, వెనుకకు కదులుతుండగా, దానిపైకి ఎక్కి ఓ యువకుడు రీల్స్ షూట్ చేశాడు. ఈ సంఘటన ఎప్పుడు జరిగిందో తెలియదు కానీ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వాహనం నడుపుతున్నది ఎవరు, రీల్ ఎప్పుడు షూట్ చేశారు అనే విషయాలపై చర్చ జరుగుతోంది. స్టే షన్ ఆవరణలోనే జరిగినా పోలీసులకు తెలియకపోవడం ఏంటన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంపై ఎస్‌ఐ రమేశ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఆ వీడియో మూడు నెలల క్రితానికి చెందినదని, సోమవారం సోషల్ మీడియాలో పోస్టు చేయడం వల్ల వైరల్ అయ్యిందని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ అనంత రం చర్యలు తీసుకుంటామన్నారు.

క్రైం కార్నర్

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

మాగనూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మాగనూరు మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గుడి శంకర్(19) ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్, మహేశ్ అన్నాదమ్ములు. వారి తల్లిదండ్రులు గతంలోనే మరణించారు. మహేశ్‌కు 6 నెలల క్రితం అదే గ్రామానికి చెందిన యువతితో పెళ్లికాగా, ఇల్లరికం వెళ్లాడు. దీంతో గ్రామంలో ఒంటరిగా ఉంటున్న మహేశ్, తమకు బంధువైన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. వారి కుటుంబ సభ్యులు ఆమెకు వేరే సంబంధాలు చూస్తున్నారని తెలియడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరి వేసుకు న్నాడు. సోమవారం ఉదయం 7.30 గంటలకు ఇంటికి వచ్చిన మహేశ్‌కు ఉరి వేసుకున్న తమ్ముడు కనిపించాడు. వెంటనే స్థానికుల సాయంతో కిందకు దించి ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటనపై సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రిలో మహిళ మృతి

- బంధువులు, కుటుంబ సభ్యుల రాస్తారోకో
- మహబూబ్‌నగర్ పట్టణంలో ఘటన



ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని హనుమాన్‌పుర ప్రాంతంలోని ప్రైవేటు ఆసుపత్రిలో ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు రాస్తారోకో చేపట్టారు. మహబూబ్‌నగర్ మండలంలోని కోడూర్ గ్రామానికి చెందిన లలిత(35) తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 21న పట్టణంలోని శ్రీ అనే పేరుగల ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ముందు రాస్తారోకో చేపట్టారు. లలితకు వైద్యం పేరుతో రూ. 3 లక్షలు వసూలు చేశారని, ఆదివారం ఉదయం ఆమె మృతి చెందినా, సాయంత్రం వరకు చికిత్స చేస్తున్నట్లు నాటకం ఆడారని ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఆమె చనిపోయిందని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆసుపత్రి యాజమాన్యాన్ని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఊపిరితిత్తుల్లో నీళ్లు చేరి, ఇన్‌ఫెక్షన్ కావడం వల్లనే ఆమె చనిపోయిందని తెలిపారు. తమ నిర్లక్ష్యం ఏమీ లేదని స్పష్టం చేశారు.

రెండు వాహనాలు ఢీకొని
నలుగురికి గాయాలు

- శ్రీశైలం ఘాట్‌రోడ్డులో ప్రమాదం

మన్ననూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం - హైదరాబాద్ ఘాట్‌రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొని నలుగురు గాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు సమీపంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. జడ్చర్ల నుంచి శ్రీశైలం వెళుతున్న కారు, హైదరాబాద్ వైపు వస్తున్న తుఫాన్ వాహనం ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ఉన్న దేవి, శివాని, కవిత, రవీంద్రాచారిలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అంబులెన్సు ఈఎంటీ మల్లేశ్, పైలట్ వెంకటేశ్‌లు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స నిర్వహించి, అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి తరలించారు.



క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స చేస్తున్న 108 ఈఎంటీ మల్లేశ్

గుర్తుతెలియని వాహనం ఢీకొని
యువకుడి దుర్మరణం

మిడ్జిల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం రాణిపేట గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా, గోదావరిఖనికి చెందిన కనకం కుమార్ (35) నాగర్‌కర్నూలు జిల్లా, ఉర్కొండ మండలం, రెడ్యాతండా సమీపంలోని సూర్యలత కాటన్ మిల్లులో పని చేస్తున్నాడు. ఈ నెల 23న వనపర్తి జిల్లా, పెబ్బేరు మండల కేంద్రంలో బంధువుల గృహప్రవేశానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున ఒంటరిగా ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా, రాణిపేట శివారులోని గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనపై అతడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగం రాలేదని..
వివాహిత ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగం రాలేదని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో నివసించే నాగరాజుకు, శశికళ (33)తో ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు మగ పిల్లలున్నారు. నాగరాజు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. శశికళ ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తోంది. అందుకోసం ఇటీవల రాసిన కొన్ని పరీక్షల్లో ఫలితం సాధించలేకపోయింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నది. గమనించిన భర్త నాగరాజు, ఇంటి పక్కనే ఉంటున్న శశికళ తల్లిదండ్రులు తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లగా, అప్పటికే ఆమె చనిపోయి ఉన్నది. సంఘటనపై శశికళ తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భర్తతో గొడవ పడి మహిళ అదృశ్యం

తెలకపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భర్తతో గొడవ పడిన ఓ మహిళ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఎస్‌ఐ నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలోని రాంరెడ్డిపల్లికి చెందిన గీత, కురుమూర్తి దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈనెల 21న ఉదయం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. రాత్రి 7.00 గంటల సమయంలో గీత ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. ఆమె భర్త, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఇంటి నుంచి వెళ్లినప్పుడు పసుపు రంగ చీర కట్టుకొని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొండాపూర్‌లో వివాహిత..

నవాబ్‌పేట (ఆంధ్రజ్యోతి) : భర్తతో గొడవపడి ఓ మహిళ తన ఇద్దరు పిల్లలు సహా అదృశ్యం అయ్యింది. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్ పేట మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డె దేవమ్మ రెండవ కుమార్తె జ్యోతికి, కానాయకపల్లికి చెందిన చిన్నయ్యతో వివాహమైంది. కొంతకాలం తర్వాత వారిద్దరి మధ్య విబేధాలు తలెత్తడంతో జ్యోతి తల్లిగారి ఊరు కొండాపూర్‌కు వచ్చేసింది. ఇక్కడే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతోంది. ఈనెల 22న బయటకు వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. దీంతో తల్లి దేవమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



మానవపాడులో ఉపాధి హామీ పథకం పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

అన్నదాతకు ఉపాధి హామీ

- కొనసాగుతున్న 'పనుల జాతర'
- 2,825 రకాల పనులు, రూ.19.11 కోట్లు

అయిజ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అన్నదాతలకు ఆసరాగా నిలుస్తోంది. అందుకోసం గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో 'పనుల జాతర' కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన చెక్‌డ్యామ్‌లు, నీటి కుంటలు, పశువుల పాకలు, ఇంకుడు గుంతలు, అజోల్ల సాగు పనులు చేపడుతున్నారు. అందుకోసం రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, పనులను గుర్తిస్తున్నారు.

ఆగస్టులో ప్రారంభమైన కార్యక్రమం

జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 13 మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలోని గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించి, 100 రోజుల పని దినాలు కల్పించేందుకు ప్రభుత్వం పనుల జాతర కార్యక్రమాన్ని ఆగస్టు నెలలో ప్రారంభించింది. అందుకోసం సంబంధిత అధికారులు జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో సభలు ఏర్పాటు చేశారు. ప్రజల సూచనలు, సలహాలను స్వీకరించి పనులను గుర్తించి, ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. అందుకు అనుగుణంగా 2,825 రకాల పనులను చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులను 13 భాగాలుగా విభజించారు. అందుకు రూ. 19.11కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు.

పనులు, కేటాయించిన నిధులు

గ్రామ సభల్లో నిర్ణయించిన మేరకు 380 పశువుల కొట్టాలకు రూ. 3.42 కోట్లు కేటాయించారు. 26 గొర్రెల షెడ్ల నిర్మాణానికి రూ. 1.56 కోట్లు, అజోల్లా సాగుకు రూ 1.17 కోట్లు, 13 చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ. 65 లక్షలు, 130 జీవవ్యర్థాల ట్యాంకుల నిర్మాణానికి రూ.3.50 కోట్లు, 1,766 ఇంకుడు గుంతల నిర్మాణానికి రూ. 1.23 కోట్లు, 280 సామూహిక ఇంకుడు గుంతలకు రూ. 2.59 కోట్లు కేటాయించారు. అలాగే 14 సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 42 లక్షలు, 2 ప్లాస్టిక్ వ్యర్థాల యూనిట్ల ఏర్పాటుకు రూ. 60 లక్షలు, 29 గ్రామపంచాయితీ భవన నిర్మాణాలకు రూ. 5.80 కోట్లు, 29 అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ. 23 లక్షలు, 26 పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ. 52 లక్షలు కేటాయించారు.

పనులు సాగుతున్నాయి



జిల్లాలో నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. యూనిట్ల వారీగా అవసరమైన పనులు గుర్తించి, నిధులు కేటాయింపు జరిగింది. స్థానికంగా ఉండే కూలీలకు పని కల్పించటంతో, అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుంది. ఈ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది.

- నర్సింగరావు, అదనపు కలెక్టర్



చంద్రశేఖర్‌నగర్‌లో అజొల్లా సాగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ (ఫైల్)

యూనిట్ల వారీగా నిధులు

ఇందులో అజొల్లా సాగుకు రూ. 16 వేలు ఇస్తారు. 3 పశువులున్న రైతులు షెడ్డు నిర్మించుకునేందుకు రూ. 93 వేలు, వర్మి కంపోస్టు తయారీకి రూ. 16 వేలు అందిస్తారు. 15 నుంచి 20 వరకు గొర్రెలు, మేకల పెంపకందారులకు షెడ్డు నిర్మాణానికి రూ. 96 వేలు ఇస్తారు. మునగసాగుకు ఎకరానికి రూ.92 వేలు, పండ్ల తోటల రకాలను బట్టి చెల్లింపులు ఉంటాయి. 100 నాటు కోడి పిల్లలను పెంచే షెడ్డు నిర్మాణానికి రూ. 96 వేలు, చెక్‌డ్యాం నిర్మాణానికి రూ. 3 లక్షలు, ఇంకుడు గుంతలకు రూ. 16 వేలు ఇస్తారు.

3న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు మహబూబ్‌నగర్ నుంచి డీలక్స్ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 3వ తేదీన రాత్రి 7 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి బస్సు బయలుదేరుతుందని తెలిపారు. కాణిపాకం, వెల్లూరు క్షేత్రాల దర్శనం అనంతరం 4న సాయంకాలం 4 గంటలకు బస్సు అరుణాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడ గిరి ప్రదక్షిణ అనంతరం 5న మధ్యాహ్నం 2 గంటలకు తిరుగు ప్రయాణమై, 6న ఉదయం పాలమూరుకు చేరుకుంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సమీప బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.

మొబైల్ ఫోన్ హ్యాక్ చేసి
రూ. 40 వేలు స్వాహా

- మోసపోయిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతులతో నగదును దోచుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నహిత్ పర్వీన్‌కు ఆదివారం తన స్నేహితురాలి ఫోన్ నుంచి రూ. 40 వేలు పంపించాలని మెసేజ్ వచ్చింది. దీంతో ఆమె వెంటనే డబ్బు పంపించేసింది. మరో రూ. 20వేలు పంపించాలని మేసేజ్ రావడంతో అనుమానించి, స్నేహితురాలికి ఫోన్ చేసింది. తన ఫోన్ హ్యాక్ అయ్యిందని, తాను ఏ మెసేజూ పంపించలేదని ఆమె చెప్పింది. దీంతో బాధితురాలి వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. సంఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రంజి జట్టుకు ఎంపికవ్వాలి

- క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



ఉమ్మడి జిల్లా క్రికెట్ క్రీడాకారులతో ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్‌లో జిల్లా క్రీడాకారులు రంజి జట్టుకు ఎంపికవ్వాలని క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఆకాంక్షించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ స్కూల్ లీగ్స్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-14 బాలుర జట్టును సోమవారం ఎంపిక చేశారు. పాలమూరు పట్టణంలోని బోయపల్లి వద్దనున్న ఎండీసీఏ మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలను రాజశేఖర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు హెచ్‌సీఏ కృషి చేస్తోందన్నారు. మొత్తం 39 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని, క్రీడాకారులను మూడు జట్లుగా విభజించి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సురేశ్‌కుమార్, ముఖ్తర్, ఆబిద్, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటాలి

- బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు జాకీర్‌బిన్ మక్సూద్
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టుతో జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జాకీర్‌బిన్ మక్సూద్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జాకీర్‌బిన్ మక్సూద్ అన్నారు. రాష్ట్రస్థాయి సీనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్న ఉమ్మడి జిల్లా మహిళ, పురుషుల జట్లను సోమవారం మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికైన వారు సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మక్సూద్ మాట్లాడుతూ బాస్కెట్‌బాల్ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, ఇటీవలే ఓ క్రీడాకారిణి రైల్వేలో ఉద్యోగం సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నసూరుల్లాహైదర్, ఉపాధ్యక్షుడు సుబాహన్‌జీ, ప్రతినిధులు మీర్‌అర్షద్‌అలీ, షరీఫ్, గోపాల్, ఇలియాజ్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో ఇళ్ల కూల్చివేత

- హైకోర్టును ఆశ్రయించిన బాధితులు

మద్దూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు విస్తరణలో ఇళ్ల కూల్చివేతపై బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. నారాయణపేట జిల్లా, మద్దూర్ నుంచి రెనివట్ల, చెన్నరెడ్డిపల్లి రోడ్డు విస్తరణకు అధికారులు సిద్ధం అయ్యారు. రహదారికి ఇరువైపులా 35 ఫీట్ల మేర ఉన్న ఇళ్లకు మార్కింగ్ ఇచ్చారు. వాటి కూల్చివేత కోసం పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కూల్చివేత పనులను నిలిపివేయాలని కోరుతూ బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో స్టే విధిస్తూ సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది.

కరాటేలో పులిమామిడి విద్యార్థుల సత్తా



నేషనల్ కరాటే టోర్నీలో ప్రతిభ చాటిన నవనీత్



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

- జాతీయస్థాయి పోటీల్లో 3 బంగారు పతకాలు

ఊట్కూర్/ మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని పులిమామిడి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటారు. రంగారెడ్డి జిల్లా, కొత్తూర్‌లో జరిగిన జాతీయ స్థాయ పోటీల్లో విద్యార్థులు హారిక, రక్షిత, చరణ్‌లు బంగారు పతకాలు, కావ్యశ్రీ వెండి పతకం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో పాటు, కరాటే మాస్టర్ శేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌గౌడ్, రాములు, రమణ, ఆనంద్, మహేశ్, కురుమయ్య, శివలీల, సునీత పాల్గొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ పట్టణంలోని డ్రాగన్ షోటోకాన్ విద్యార్థి నవనీత్ గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించినట్లు సీనియర్ కరాటే మాస్టర్ ఎస్‌కే మోసిన్ తెలిపారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు...

పదర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పదర మండల కేంద్రానికి చెందిన బినమోని భిక్షపతి, వెంకటమ్మల కుమార్తె మధుప్రియ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక య్యింది. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఈ నెల 5వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్, అండర్ - 19 విభాగంలో పాల్గొన్న ఆమె రెండవ స్థానంలో నిలిచి రెండు రజిత పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. హరియాణ రాష్ట్రంలో ఈ నెల 26నుంచి 28 వరకు నిర్వహించను న్న పోటీల్లో పాల్గొననున్నది.



జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన నల్లమల యువతి మధు ప్రియ

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో
పాలమూరు వరుస విజయాలు

- అర్ధ సెంచరీలతో రాణించిన స్వాతి, సింధూజ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలికల క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు వరుస విజయాలు సాధిస్తోంది. సోమవారం రంగారెడ్డి, వరంగల్ జట్లతో జరిగిన మ్యాచ్‌లలో మహబూబ్‌నగర్ జట్టు గెలుపొందింది. వరంగల్‌తో జరిగిన మ్యాచ్‌లో స్వాతి 69, సింధూజ 77 అర్ధ సెంచరీలతో రాణించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి, కోచ్ మన్నాన్ క్రీడాకారులను అభినందించారు.



అర్ధసెంచరీలతో రాణించిన ఉమ్మడి జిల్లా బాలికల జట్టు క్రీడాకారిణులు స్వాతి, సింధూజ

రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టుకు వరద తగ్గడంతో ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 2 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఒక యూనిట్ ద్వారా 0.077 మిలియన్ యూనిట్లు, దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో 0.080 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఇప్పటి వరకు మొత్తంగా 1011 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు.

రాష్ట్ర కబడ్డీ జట్టు కెప్టెన్‌గా నందిని

కల్వకుర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పదర గ్రామానికి చెందిన క్రీడాకారిణి నందిని సబ్‌జూనియర్ రాష్ట్ర కబడ్డీ జట్టు కెప్టన్‌గా ఎంపికయ్యింది. ఈ మేరకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదయ్య గౌడ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హరియాణ రాష్ట్రం, పానిపట్‌లో ఈ నెల 27 నుంచి 30 వరకు నిర్వహించనున్న 35వ సబ్‌జూనియర్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఆమె కెప్టెన్‌గా వ్యవహరించనున్నది.

అండర్-17
కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ సాయి కో ఆపరేటివ్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎన్.శ్రీకాంత్ హర్యానాలో జరిగిన అండర్ - 17 కబడ్డీ పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థికి కళాశాల తరపున అన్నివిధాలా ప్రోత్సహిస్తామన్నారు.



ఎన్.శ్రీకాంత్.

న్యూస్ బాక్స్

గ్రీవెన్స్‌డేకు 19 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ గ్రీవెన్స్‌కు వస్తున్న పిర్యాదుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లలో బాధితులకు న్యాయం జరగకపోవడంతో పోలీస్ బాస్‌ను ఆశ్రయిస్తున్నారు. స్టేషన్‌లకు ఇప్పటికీ సామాన్యులు వెళ్లలేని పరిస్థితి ఉండటం, అక్కడి పోలీసులు వీరిని సరిగ్గా రిసీవ్ చేసుకోకపోవడంతో ప్రతీ సోమవారం జిల్లా నలుమూలల నుంచి బాధితులు ఎస్పీని కలిసి పిర్యాదులు చేస్తున్నారు. సోమవారం 19 పిర్యాదులు ఎస్పీకి అందజేశారు. ఎస్పీ వారి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసులతో మాట్లాడిన ఎస్పీ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వైద్యులపై దాడి చేసిన వ్యక్తులపై కేసు

- వైద్యం నిర్లక్ష్యంపై మరో కేసు

మహబూబ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీ ఆసుపత్రిలో మహిళ మృతి ఘటనపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి. కోడూరుకు చెందిన లలిత అనే మహిళ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా రెండు రోజుల అనంతరం చనిపోయింది. దీంతో సోమవారం మృతురాలి బంధువులు ఆసుపత్రి వద్ద ధర్నా చేపట్టారు. కోపోద్రేక్తులైన బంధువులు ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిపై దాడి చేయడంతో వైద్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు మృతురాలి బంధువులపై కేసు నమోదు చేశారు. రోడ్డుపై నాలుగు గంటల పాటు ధర్నా చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని మరో కేసు నమోదు చేశారు. అయితే ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా లలిత చనిపోయిందని, ఇందుకు ఆసుపత్రి నిర్లక్ష్యమే కారణమని మృతురాలి బంధువులు ఫిర్యాదు మేరకు ఆసుపత్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటికి ఇబ్బందులు

నవాబ్‌పేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకర్లపాడ్, సీతమ్మతండాలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు, తండావాసులు తెలిపారు. సీతమ్మతండాకు మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. 20 రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న తమను పట్టించుకోవడం లేదని కాకర్లపాడ్ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెల్ఫేర్ బోర్డు నిధులపై విచారణ చేపట్టాలి

పాలమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వెల్ఫేర్ బోర్డు నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిర్మాణ రంగం కార్మికులతో కలిసి జిల్లా కేంద్రంలో కరపత్రం ఆవిష్కరించి, మాట్లాడారు. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమతి ఉపసంహరించాలన్నారు. జీవో 12ను ఎత్తివేయాలన్నారు. సీఎస్సీ హెల్త్ టెస్టులను ఎత్తివేయాలని 25న జేఏసీ నాయకత్వంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. దేవానందు, యాదయ్య, భీమయ్య, రాజు, కృష్ణ, అమర్, కృష్ణయ్యగౌడ్, రెహమాన్, గౌస్, రాజీవ్‌రెడ్డి, సుజాత, మన్నెమ్మ, పద్మ, అంజమ్మ పాల్గొన్నారు.

హంస క్వింటాలుకు గరిష్ఠంగా రూ.1,889

దేవరకద్ర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం జరిగిన వేలంలో పెద్ద హంస 108 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా ధర రూ.1,889, కనిష్ఠంగా రూ.1,845 పలికినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు. ఆర్ఎన్ఆర్ 1,733 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,690, కనిష్ఠంగా రూ.2,403, పెద్ద సోనా 253 క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.2,436, కనిష్ఠంగా రూ.2,250 పలికింది.

ప్రీ ప్రైమరీ పాఠశాలలు అంగన్‌వాడీల్లో నిర్వహించాలి

మూసాపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తలపెట్టిన ప్రీ ప్రైమరీ పాఠశాలలను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఏర్పాటు చేయాలని అడ్డాకుల మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ తరఫున ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కురుమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ మండలానికి మూడు, నాలుగు చొప్పున ప్రీ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ పాఠశాలలో చదివేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో 4 ప్లస్ పిల్లలను తీసుకోవాలని నిర్ణయించడంతో భవిష్యత్తులో అంగన్‌వాడీలు రద్దయ్యే అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలని, ఆయాలకు అదనపు వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గత 30 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారికి సర్వీసును క్రమబద్ధీకరించాలని సూపరింటెండెంట్ జయపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ నాయకురాలు కృష్ణవేణి, కల్పన, సత్యమ్మ ఉన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి

» కలెక్టర్‌తో కలిసి ఇందిరమ్మ చీరల పంపిణీ



భూత్పూర్‌లో ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

భూత్పూర్/మూసాపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జీ.మధుసూధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మునిసిపాలిటీ కేంద్రంలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి మహిళలకు చీరలు పంపిణీ చేసి, మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, మహిళా సంఘాల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ, పెట్రోల్ బంకుల నిర్వహణ, గ్యాస్ సిలిండ్ల రాయితీ, మహిళా క్యాంటీన్లు, వరి కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఆర్టీసీలో అద్దె బస్సులు నడిపే విధంగా వీలు కల్పించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. అంతకుముందు మూసాపేట మండల కేంద్రంలో చీరల పంపిణీ, నందిపేటలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ, జానంపేటలో కబ్రస్తాన్ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన, పోల్కంపల్లి ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ అనంతరం చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శెట్టి చంద్రశేఖర్, శ్రీహరి, పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనర్సింహ్మారెడ్డి, మాజీ ఎంపీపీలు శేఖర్‌రెడ్డి, కృష్ణయ్య, నాగార్జున్‌రెడ్డి, తహసీల్దార్లు కిషన్, రాజు, మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్, ఎంపీడీవోలు ఉమాదేవి, కృష్ణయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పద్మ, మాజీ సర్పంచ్ హర్యానాయక్, కొండన్న, నర్సింహులు, ఆనంద్‌కుమార్, నరేందర్, మశ్చందర్, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

● కోయిలకొండ : మండలంలోని అంకిళ్ల, మల్కాపూర్‌లో ఐకేపీ సీసీ మల్లేష్ చీరలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు రవి యాదవ్, సంపత్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● హన్వాడ : హన్వాడ మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేందర్, నాయకులు కృష్ణయ్య, షబ్బీర్, వెంకటయ్య, కలీం, అమరేందర్ చీరలు పంపిణీ చేశారు.

ప్రతీ మహిళకు చీర అందజేస్తాం



మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల/రాజాపూర్/బాలానగర్/నవాబ్‌పేట/మిడ్జిల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు ప్రభుత్వం ద్వారా ఇస్తున్న చీరలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 112 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందచేశారు. అలాగే మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిర మహిళా శక్తి సంబురాల్లో పాల్గొని స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అదే విధంగా రాజాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలానగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో, నవాబ్‌పేట మండల కేంద్రంలో, మిడ్జిల్ మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే సోలార్ పాయింట్లు, మహిళా సంఘాలకు బస్సు కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు, స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, తహసీల్దార్లు నర్సింగ్‌రావు, రాధాకృష్ణ, శ్రీనివాసులు, ఎంపీడీవోలు విజయ్‌కుమార్, విజయలక్ష్మి, జయరాములు, మార్కెట్ కమిటీ చైర్మన్లు అశ్విని, హరలింగం, జ్యోతిఅల్వాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్‌గౌడ్, ఎంపీవో వెంకట్‌రాములు, డీఆర్డీప నర్సింహులు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య, డీపీఎం రాంమూర్తి, అరుణ, ఏపీఎం హైమావతి, సీసీలు రవి, మంగమ్మ, వెంకటయ్య, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

'ఐ బొమ్మ రవిని రాబిన్‌హుడ్ అంటున్నారు'

జడ్చర్ల : ఐ బొమ్మ రవిని ప్రజలు రాబిన్‌హుడ్ అంటున్నారంటూ ఎమ్మెల్యే జనంపల్ల అనిరుధ్‌రెడ్డి ఆసక్తికరమైన వ్యాఖ్య చేశారు. రూ.వెయ్యి కోట్లతో సినిమా తీస్తే ప్రొడ్యూసర్, హీరో, డైరెక్టర్‌లే లాభపడతారని, హీరోయిన్‌లకు సైతం తక్కువ రెమ్యునరేషన్ ఇస్తున్నారంటూ చెప్పారు. తప్పుచేసిన వారిని శిక్షించాల్సిందేనని అన్నారు. వేల కోట్లతో సినిమాలు తీసి తమపై ఎందుకు భారం వేస్తున్నారంటూ ప్రజలు తన వద్ద ఆవేదనను పంచుకున్నారని చెప్పారు. రూపాయి లేకుండా సినిమా చూపించిన ఐ బొమ్మ రవిని రాబిన్‌హుడ్‌లా చూస్తున్నారని, హీరో అని కొందరు అంటున్నారన్నారు.

వడ్డీ లేని రుణాల పంపిణీ : కలెక్టర్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ విజయేందిర బోయి, అధికారులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఈనెల 25న స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కతో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సీఈవో దివ్యరాజన్‌తో ఇందిరమ్మ చీరలు, వడ్డీలేని రుణాల పంపిణీపై వీసీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని వారికి ముందుగానే సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో గల 9155 స్వయం సహాయక సంఘాలకు రూ.10.49 కోట్లు వడ్డీ లేని రుణాల కింద పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. జడ్చర్ల నియోజకవర్గంలో జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, దేవరకద్ర నియోజకవర్గంలో శ్రీనివాస ఫంక్షన్ హాల్, మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ శాసనసభ్యులు మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా సామాజిక భద్రతా పథకాలపై అవగాహన సదస్సు పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర బోయి ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీవో నర్సింహులు, జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, ఉపకార్మిక కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, సహాయ కార్మిక కమిషనర్ అల్తాఫ్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు



ఇసుక డంపులను ధ్వంసం చేయిస్తున్న అధికారులు

దేవరకద్ర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనుమతుతి లేకుండా ఇసుక రవాణా చేయడం, ఫిల్టర్ ఇసుకను తయారు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దీపిక పేర్కొన్నారు. మండలంలోని వెంకటాయపల్లి గ్రామంలోని వాగు సమీపంలో ఓ రైతు పొలంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేసి విక్రయిస్తున్నారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితం కావడంతో తహసీల్దార్ స్పందించారు. ఈ మేరకు ఆర్ఐ శరత్‌కుమార్ వెంకటాయపల్లి ఫిల్టర్ కేంద్రానికి వెళ్లి అక్కడ ఉన్న ఇసుక డంపులను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

గ్రామ పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు



శేర్‌పల్లి (హెచ్) గ్రామ పంచాయతీ భవనం

జడ్చర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సర్పంచు ఎన్నికల ఉత్కంఠకు ప్రభుత్వం తెర దించింది. గత నెలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో ఖరారు చేసిన రిజర్వేషన్లను రద్దు చేసి కొత్తగా రిజర్వేషన్ల పద్ధతి ఖరారు చేసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో మండలాల వారీగా సర్పంచుల రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి.

జడ్చర్ల మండలం..

ఆల్వాన్‌పల్లి, బూర్గుపల్లి, చిన్నపల్లి, గంగాపురం, ఖానాపూర్, కోడ్గల్, మల్లెబోయిన్‌పల్లి, పెద్దపల్లి, ఉదండాపూర్ జనరల్, చిన్నఆదిరాల, గొల్లపల్లి, కుర్వపల్లి, గోప్లాపూర్, కిష్టారం, శంకరాయపల్లి, తంగెళ్లపల్లి, వల్లూరు జనరల్ మహిళ, బండమీదిపల్లి, పెద్దఆదిరాల, నెక్కొండ బీసీలకు కేటాయించగ, ఎక్వాయ్‌పల్లి, కుర్వగడ్డపల్లి, నసరుల్లాబాద్ బీసీ మహిళ, ఆలూరు, కొండేడు, లింగంపేట, పోలేపల్లి ఎస్సీ, చెర్లపల్లి, కిష్టంపల్లి, మాచారం ఎస్సీ మహిళ, చిట్టబోయిన్‌పల్లి, కొల్లోనిమర్లతండా, కొత్తతండా, లక్ష్మీనాయక్‌తండా, మర్రిచెట్టుతండా, నసరుల్లాబాద్‌తండా, పెద్దతండా, పోచమ్మగడ్డతండాలను ఎస్టీ, దేవునిగట్టుతండా, ఈర్లపల్లి, మాటుబండతండా, నేలబండతండా, రామస్వామిగుట్టతండా, శంకరాయపల్లి తండా, తుప్పడుగడ్డతండా ఎస్టీ మహిళ రిజర్వు అయ్యాయి.

మహబూబ్‌నగర్ రూరల్..

అప్పాయిపల్లి, గాజులపేట్, మాచన్‌పల్లి తండా, మణికొండ, జమిస్తాపూర్ గ్రామాలకు జనరల్ మహిళ, చౌదర్‌పల్లి, కోటకద్ర, ఓబ్లాయిపల్లి, ఓబ్లాయిపల్లి తండా, పోతన్‌పల్లి, తెలుగుగూడెం గ్రామాలు జనరల్, అల్లీపూర్, కోడూర్ బీసీ మహిళ, ధర్మాపూర్, ఫత్తేపూర్ బీసీ జనరల్, తువ్వగడ్డతండా, భవానితండా ఎస్టీ మహిళ, వెంకటాపూర్, రేగడిగడ్డతండా, లాల్యానాయక్ తండా ఎస్టీ జనరల్, బొక్కలోనిపల్లి, ఇప్పలపల్లి ఎస్సీ మహిళ, మాచన్‌పల్లి, రామచంద్రాపూర్ ఎస్సీ జనరల్‌గా రిజర్వు అయ్యాయి.

భూత్పూర్ మండలం..

అన్నాసాగర్, హస్నాపూర్, కొత్తమొల్గర, పోతులమడుగు జనరల్, ఏవీఆర్ కాలనీ, లంబాడి కుంటతండా ఎస్టీ జనరల్, భట్టుపల్లి, చౌలతండా, తాటికొండ, తాటిపర్తి జనరల్ మహిళ, వెల్కిచర్ల, కప్పెట, రావులపల్లి బీసీ జనరల్, కర్వెన, కొత్తూరు బీసీ మహిళ, మద్దిగట్ల, పాతమొలగర ఎస్సీ జనరల్, పెద్దతండా ఎస్టీ మహిళ, శేరిపల్లి (హెచ్) ఎస్సీ మహిళ రిజర్వు అయ్యాయి.

కోయిలకొండ మండలం..

రాజునాయక్‌తండా, సంగనోనిపల్లి, ఎల్లారెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, బోడోనిగుట్టతండా, మోదీపూర్ ఎస్టీ జనరల్, ఆచార్యపూర్, చింతల్‌తండా, గంగ్యానాయక్‌తండా, నక్కవానికుంటతండా, పెర్కివీడ్, సోమ్లనాయక్‌తండా ఎస్టీ మహిళ, అంకిళ్ల, ఖాజీపూర్, కొత్లబాద్ ఎస్సీ జనరల్, కోయిలకొండ, సూరారం ఎస్సీ మహిళ, అభంగపట్నం, మల్కాపూర్, శేరివెంకటాపూర్, అనంతాపూర్ బీసీ జనరల్, గార్లపాడ్, జమాల్‌పూర్, వీరంపల్లి, వింజమూర్ బీసీ మహిళ, బూర్గుపల్లి, చందాపూర్, కనాయపల్లి, కానుగుబండతండా, లింగుపల్లి, పార్‌పల్లి, ఉబ్బడితండా, రామన్నపల్లి తండా, రాంపూర్, మల్లాపూర్ జనరల్, చంద్రాసుపల్లి, దమాయపల్లి, హనుమాన్‌గడ్డతండా, ఇబ్రహీంనగర్, కేశ్వాపూర్, లింగాల్‌చేడ్, నల్లవెల్లి, పల్గుతండా, తిర్మలంపల్లి జనరల్ మహిళ రిజర్వు అయ్యాయి.

మిడ్జిల్ మండలం..

భైరంపల్లి, దోనూర్, సింగందొడ్డి, వెలుగొమ్ముల, వాడియాల జనరల్, బోయిన్‌పల్లి, కొత్తపల్లి, మున్ననూరు, రాణిపేట, వల్లభరావుపల్లి జనరల్ మహిళ, చిలువేరు, మసిగుండ్లపల్లి, మిడ్జిల్ బీసీ, కంచనపల్లి, వేముల బీసీ మహిళ, అయ్యవారిపల్లి, కొత్తూరు ఎస్సీ జనరల్, మల్లాపూర్, వస్పుల ఎస్సీ మహిళ, ఈదులబాయితండా, పెద్దగుండ్లతండా ఎస్టీ జనరల్, చౌటకుంటతండా, లింబ్యాతండా, మంగళిగడ్డతండా ఎస్టీ మహిళ రిజర్వు అయ్యింది.

నవాబ్‌పేట మండలం..

అమ్మాపూర్, చెన్నారెడ్డిపల్లి, జంగమయ్యపల్లి, కూచూర్, నవాబ్‌పేట, తీగలపల్లి జనరల్ మహిళ, బట్టోనిపల్లి, కాకార్జల తండా, కిషన్‌గూడ, కొల్లూర్, మెట్టుగడ్డ తండా ఎస్టీ జనరల్, చౌడూర్, దేపల్లి, హజిలాపూర్, పోమాల్ బీసీ మహిళ, దర్పల్లి, దయపంతులపల్లి, దొడ్డిపల్లి ఎస్సీ మహిళ, గురుకుంట, కాకర్జాల, కాకర్లపాడ్, కొండాపూర్, లోకిరేవు, మల్లారెడ్డిపల్లి, పల్లెగడ్డ, రేకుల చౌడాపూర్, సిద్దోటం, తిమయ్యపల్లి, యన్మనగండ్ల జనరల్, హన్మసానిపల్లి, ఇప్పటూర్, కామారం, కార్కొండ బీసీ జనరల్, కారూర్, కేశవరావ్‌పల్లి, లింగంపల్లి, రుద్రారం ఎస్సీ జనరల్, కోళ్లగుట్ట తండా, పుట్టోనిపల్లితండా, రాంసింగ్‌తండా, ఊరంచుతండా, వెంకటేశ్వరతండా ఎస్టీ మహిళ రిజర్వు అయ్యాయి.

రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇబ్బంది కలకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సివిల్ సప్లై అధికారులు, రైస్ మిల్లుల యాజమాన్యం వ్యవహరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. సోమవారం తన చాంబర్‌లో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, జిల్లా మేనేజర్ పౌర సరఫరాల అధికారి రవినాయక్, డీఆర్డీవో సూపరింటెండెంట్ మూర్తి, రాజశేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 190 కొనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటికీ 140 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికీ 3,902 రైతుల వద్ద ధాన్యం కొనడం జరిగిందన్నారు. మొత్తం రూ.18.80 కోట్ల రైతుల అకౌంట్స్‌లో జమ చేయడం జరిగిందన్నారు. ప్రతి రోజు సాయంత్రం అధికారులు ప్రతీ కొనుగోలు కేంద్రం నుంచి ఎంత ధాన్యం రైస్ మిల్లులకు చేరుతుంతో వివరాలు ఇవ్వాలని ఆదేశించారు.

సాయిబాబా జీవితం ఆదర్శం : ఎంపీ డీకే అరుణ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సాయిబాబా జీవితం మానవాళికి ఆదర్శం అని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. పుట్టపర్తి సాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో బాగంగా సోమవారం నగరంలోని వేంకటేశ్వరకాలనీలో గల బాబామందిరంలో నిర్వహించిన ప్రత్యేక పార్థనలకు ముఖ్య అతిథిగా హాజరై సాయిబాబాకు హారతి ఇచ్చారు. అనంతరం నగరంలోని తన నివాసంలో సర్దార్ వల్లాబాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా నగరంలోని సౌత్‌జోన్ పరిధిలోని పంచవటి పాఠశాల, సంస్కార్ పాఠశాల, మహబూబ్‌నగర్ హైస్కూల్, శిశు వికాస్ పాఠశాల, రవీంద్ర భారతి పాఠశాల, ఢిల్లీ ఒలంప్యాడ్ పాఠశాలలో బీజేపీ దక్షిణ మండల అధ్యక్షుడు కురుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, ఓబీసీ అధ్యక్షుడు యాదయ్య, పెద్ద నర్సింహులు, రాచాల శ్రీధర్ పాల్గొన్నారు.

దిగుమతి చేసుకునే పత్తిపై సుంకం విధించాలి



సీసీఎస్ కార్యాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పాలమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11శాతం సుంకం వసూలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, పత్తి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భూక్యాచందు నాయక్, రాములు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీసీఎస్ కార్యాలయం ఎదుట తెలంగాణ పత్తి రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రైతులకు నష్టం చేసే కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలన్నారు. పత్తి రైతులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని సీసీఐ అధికారికి వినతిపత్రం అందజేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని, తేమతో నిమిత్తం లేకుండా సీసీఐ ద్వారా రైతుల పత్తిని కొనుగోలు చేయాలన్నారు. సీసీఐ ఆధ్వర్యంలో గతంలో ప్రతీ ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసేవారని, ఇప్పుడు కేవలం 7 క్వింటాళ్లు కొనుగోలు చేయాలనే కేంద్రం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ.475 బోనస్ అమలు చేయాలన్నారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3, ఎల్-4 నిబంధనల పేరుతో మిల్లర్లను కట్టడి చేయడంతో రైతుల వద్ద ఉన్న మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. నారాయణపేట అధ్యక్షులు అంజిలయ్య, అశోక్, నాగర్‌కర్నూల్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, శ్రీనివాసులు, గద్వాల, మహబూబ్‌నగర్ అధ్యక్షులు, పత్తి రైతులు పాల్గొన్నారు.

బీసీల హామీని నెరవేర్చని రాష్ట్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్

జడ్చర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసాకే ఎన్నికలు నిర్వహిస్తామన్న హామీని తుంగలో తొక్కి, బీసీల గొంతును రాష్ట్ర ప్రభుత్వం కోసిందని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ ఆరోపించారు. జడ్చర్ల మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే లెక్కల ఆధారంగా 56 శాతానికి పైగా బీసీలున్నారని చూపించి, నేడు కేవలం 23శాతం రిజర్వేషన్లు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. జరగబోయే మంత్రివర్గ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలను అడ్డుకోవాలని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే తగిన బుద్ధి చెప్పడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీసీ జాగృతి సేన నాయకులు నర్సింహులు, విజయ్‌కుమార్, గోపాల్, రఘు, శివరాములు, చారి, జంబులయ్య పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పు పెట్టరాదు

జడ్చర్ల/భూత్పూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పొలంలో వరి కోతల అనంతరం వరి కొయ్యలకు నిప్పు పెట్టరాదని జడ్చర్ల ఏవో గోపీనాథ్, భూత్పూర్ ఏవో మురళీధర్ సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వరికొయ్యలను తగలబెట్టడంతో భూమిలో కర్బనశాతం తగ్గి కొంత కాలానికి భూమి నిస్సారంగా మారుతోందన్నారు. ఒక టన్ను వ్యర్థాలను తగలబెట్టడంతో 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్, 1400 కిలోల కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలో కలిసి వాయు కాలుష్యం పెరుగుతోందన్నారు. వీటితో పాటు భూమిలో ఉన్న సూక్ష్మ జీవులు చనిపోతాయని, తేమశాతం తగ్గుతుందన్నారు. వరికొయ్యలను భూమిలో కలియదున్నితే భూసారం పెరిగి పోషకాలు అందుతాయన్నారు. సింగిల్ సూపర్ ఫాస్పేట్ లేదా డీకంపోజర్ల వంటివి ఉపయోగించి భూమిలో కలియదున్నా లని పేర్కొన్నారు.

గ్రామ కంఠం భూమిని కాపాడాలి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కొత్తతండా వాసులు

జడ్చర్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తతండా గ్రామ కంఠం భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలంటూ సోమవారం జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం ఎదుట తండావాసులతో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి అనుమతి లేకుండా గ్రామకంఠం భూమిలో దౌర్జన్యంగా, అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని విద్యార్థి సంఘం నాయకుడు రమేశ్‌నాయక్ ఆరోపించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, భూమిని కాపాడే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తండావాసులు నేనావత్‌చందర్, కిషన్‌నాయక్, ఉమ్లానాయక్, తౌర్యానాయక్, హరీష్‌నాయక్, రాము, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.